క్లుప్తంగా

ఐటీఐలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోండి

తొండూరు : స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2024–25 సంవత్సరానికి సంబంధించి మొదటి విడతలో భర్తీ కాగా మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తుకు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ 10వ తరగతి పాసైన విద్యార్థులు ఆసక్తిగల వారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్, కులధృవీకరణ పత్రాలు, ఫొటోలతో తొండూరులోని ఐటీఐ కళాశాలలో ఉచితంగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈనెల 27వ తేదీ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ఆయన తెలిపారు. వివరాలకు 8008982619, 8919216275లను సంప్రదించాలన్నారు.

బాలికల హాస్టల్ తనిఖీ



బాలికల హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి

ఎర్రగుంట్ల : పట్టణంలోని రాణివనంలో ఉన్న ప్రభుత్వ బాలికల హాస్టల్‌ను బుధవారం తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్యంను కచ్చితంగా పాటించాలని, విద్యార్థులకు నీటి కొరత రాకుండా శుద్ధి నీటిని వాడాలని హాస్టల్ వార్డెన్‌కు ఆమె సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



డిప్యూటీ రేంజ్ అధికారి గుర్రప్పను సన్మానిస్తున్న అటవీశాఖ సిబ్బంది

వేంపల్లె : వేంపల్లె అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి గుర్రప్ప కదిరి రేంజ్ అధికారిగా ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న అధికారికి బుధవారం వేంపల్లె అటవీశాఖ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ అధికారి బాలసుబ్రమణ్యం హాజరై ఆయనకు వీడ్కోలు పలికారు. అలాగే విధి నిర్వహణలో తన అనుభూతిని అధికారులు, సిబ్బందితో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జిలానీబాషా, ఫారెస్టు బీట్ అధికారి మధు, సిబ్బంది, కడప ఫ్లయింగ్ స్క్వాడ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మకోసం.. ఒక చెట్టు



మొక్కలు నాటుతున్న శశిభూషణ్‌రెడ్డి

సింహాద్రిపురం : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రధాని నరేంద్రమోదీ ఢిల్లీలోని బుద్ధ జయంతి పార్కులో ఒక రావిచెట్టు నాటి ఏక్ పేడ్ మా కి నామ్ (ఒక చెట్టు అమ్మకోసం) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఒక్కరు ఒక చెట్టు అమ్మ కోసంలో పాల్గొని విరివిగా చెట్లు నాటాలని కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. అందులో భాగంగా సింహాద్రిపురం మండలంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్‌తో కలిసి బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు అమ్మ కోసం ఒక మొక్క నాటాలన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మాలెపాడు గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరంనకు విశేష స్పందన లభించిందని పశువైద్యాధికారి డాక్టర్ జ్యోతి తెలిపారు. ఈ శిబిరంలో పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఎర్రగుంట్ల పశుగణాభివృద్ధి సంస్థ ఏడీ డాక్టర్ బి.మునెయ్య, పశుగణాభివృద్ధి వైద్యాధికారులు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

విద్యుత్ అదాలత్ ద్వారా సమస్యల పరిష్కారం

తొండూరు : విద్యుత్ అదాలత్ ద్వారా ఈనెల 5న పులివెందుల డివిజన్ పరిధిలోని తొండూరు సెక్షన్, సింహాద్రిపురం సెక్షన్‌కు సంబంధించి విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తొండూరు, సింహాద్రిపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రమేష్‌రెడ్డి, సుబ్రమణ్యంలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అంబకపల్లె రోడ్డులోని వైఎస్సార్ మినీసెక్రటేరియట్ దగ్గర ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత సంస్థకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది అదాలత్‌కు హాజరవుతారన్నారు. వినియోగదారులు సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

పత్తిపంటను చుట్టుముట్టిన తెగుళ్లు

- నివారణకు విరివిగా మందుల పిచికారీ
- పంటలో అదుపులోకి రాని తెగుళ్లు
- ఆందోళన చెందుతున్న పత్తి రైతులు



తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేస్తున్న రైతు

వేముల : ఈ ఏడు వేసవి పంటగా పత్తిపంట విస్తారంగా సాగైంది. నియోజకవర్గ వ్యాప్తంగా 5వేల ఎకరాలకు పైనే రైతులు పత్తి పంటను సాగుచేస్తున్నారు. మామూలుగా వర్షాధారం కింద జూన్, జూలై నెలలో పత్తిపంట సాగవుతుంది. అయితే వ్యవసాయ బావులు, బోర్ల కింద మార్చి, ఏప్రిల్ మాసాల్లో వేసవి పంటగా పత్తి సాగు చేస్తున్నారు. వేసవిలో పంట సాగు చేయడం వల్ల పంట దెబ్బతినకుండా సకాలంలో నీటితడులు అందించారు. సాగుచేసాక వర్షాలతో ఏపుగా పెరిగి కాయలతో ఉంది. ముందు సాగుచేసిన తోటల్లో దిగుబడులు చేతికి రానున్నాయి. దిగుబడులు అందడం ప్రారంభమయ్యాక 40 రోజుల పాటు తోటలలో పత్తి దిగుబడులను కూలీలతో తీయిస్తారు. దిగుబడులు అందేకాలంలో వర్షాలు రాకుండా ఎండలు ఎక్కువగా ఉన్నట్లయితే కాయలు పగిలి పత్తి దిగుబడులు పూర్తవుతాయి.

పత్తి పంటను చుట్టుముట్టిన తెగుళ్లు

ఈ ఏడు వేసవిలో సాగుచేసిన పత్తి పంటను తెగుళ్లు చుట్టుముట్టాయి. సాగుచేసిన 40 రోజుల నుంచే మందులను పిచికారీ చేయాల్సి ఉంటుంది. పంటలో తెల్లదోమ, పచ్చదోమ ఎక్కువగా ఆశిస్తోంది. ఈ దోమ ఎక్కువగా ఉన్నట్లయితే పూత, పిందెలు రాలిపోతాయి. పత్తితోటలు ఏపుగా పెరిగి బలంగా ఉండటంతో ఎక్కువగా తెగుళ్లు వ్యాపిస్తున్నాయని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. పత్తికాయలు పగిలే దశలో పురుగు కూడా ఆశిస్తుందని, కాయలు పగులకుండా మూతపడిపోతాయని అధికారులు చెబుతున్నారు. దిగుబడులు కూడా అందవని పంటకు ఎక్కువగా తెగుళ్ల సోకడం ద్వారా పంట దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

అదుపులోకి రాని తెగుళ్లు

పత్తిపంటకు సోకిన తెగుళ్లు అదుపులోకి రావడం లేదు. తెల్లదోమ, పచ్చదోమ నివారణకు రైతులు అన్ని రకాల మందులను పిచికారీ చేస్తున్నారు. అయినప్పటికీ దోమను మాత్రం నివారించలేకపోతున్నారు. తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవడంతో పాటు విత్తన కంపెనీల ప్రతినిధులు కూడా పంటను పరిశీలించి రైతులకు సూచనలిస్తున్నారు. అందరి సూచనల మేరకు రైతులు మందులను పిచికారీ చేస్తున్నారు. ఇప్పటికే ఒక్కో రైతు 4, 5 సార్లు మందులను పిచికారీ చేశారు. పిచికారీ చేసినప్పటికీ తెగుళ్లు మాత్రం అదుపులోకి రాకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

దిగుబడులపై తీవ్ర ప్రభావం

పత్తిపంటకు సోకిన తెగుళ్లు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతాయని రైతులు వాపోతున్నారు. తెగుళ్లు అదుపులోకి రాకపోతే కాయలు రాలిపోయి దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇందుకోసం రైతులు తెగుళ్లు నివారించేందుకు నానా పాట్లు పడుతున్నారు. తెగుళ్ల నివారణకు అదనంగా వేలకు వేలు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటి వరకు పంటను కాపాడుకొని దిగుబడులు అందే సమయంలో తెగుళ్లు చుట్టుముట్టడం రైతులను కలచివేస్తోంది. సాగులో ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు తెగుళ్లతో వారి ఆశలన్నీ నీరుగారిపోతున్నాయి.

ఆందోళనలో పత్తిరైతులు

పంటకు తెగుళ్లు సోకడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అందరి సలహాలు, సూచనలు పాటిస్తున్నా తెగుళ్లు నివారించడంలో విఫలమవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికి వచ్చిన పంట దెబ్బతింటే తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. పంట ఆశాజనకంగా కనిపించడంతో దిగుబడులు ఉంటాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు పడుతుండటం, తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉండటం, మందులు పిచికారీ చేయాలన్నా వీలుకావడం లేదని రైతులు వాపోతున్నారు. తెగుళ్లకు తట్టుకుని సాగులో ఏ మేరకు దిగుబడులు ఉంటాయో వేచి చూడాల్సిందే.

7 ఎకరాల్లో పత్తి సాగు చేశా



నాకున్న 7 ఎకరాల్లో పత్తి సాగు చేశా. సాగు కోసం రూ.లక్ష పైనే పెట్టుబడులు పెట్టా. పంట సాగు చేసిన 40 రోజులకే తెగుళ్లు సోకాయి. తెగుళ్ల నివారణకు నాలుగు సార్లు మందులను పిచికారీ చేశా. ఒకసారి మందు పిచికారీ చేయాలంటే ఎకరాకు రూ.2వేలు ఖర్చు అవుతుంది. తెగుళ్లు మాత్రం అదుపులోకి రాలేదు.

–అంకిరెడ్డి, పత్తిరైతు

దిగుబడులపై తీవ్ర ప్రభావం



పత్తి పంటకు విపరీతంగా తెగుళ్లు సోకుతున్నాయి. పచ్చదోమ, తెల్లదోమ ఎక్కువగా ఆశిస్తోంది. నివారణకు వేల రూపాయలను ఖర్చు చేసి మందులను పిచికారీ చేశా. పంట బాగున్నప్పటికీ తెగుళ్లకు దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. వర్షాలతో పొలాల్లో తేమ ఎక్కువగా ఉండటంతో తెగుళ్లు వ్యాపిస్తున్నాయి.

– రాఘవరెడ్డి, పత్తి రైతు, గొందిపల్లి

రహదారి విస్తరణకు మోక్షం

ముద్దనూరు : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి విస్తరణకు ఎట్టకేలకు మోక్ష లభించింది. స్థానిక 4 రోడ్ల కూడలి నుంచి జమ్మలమడుగు రహదారిలోని రైల్వే గేటు వరకు రహదారి విస్తరణ, అభివృద్ధి పనులకు సంబంధించి బుధవారం అధికారులు కొలతలు చేపట్టారు. నేషనల్ హైవే జేఈ సురేంద్రరెడ్డి స్థానిక సిబ్బందితో కలిసి రహదారి అభివృద్ధి కోసం అవసరమైన మేరకు రోడ్డు ఇరువైపులా కొలతలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 18 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణం, రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజి ఏర్పాటు, తాగునీటి పైప్‌లైన్ మార్చడం, ఇరుప్రక్కల వీధిదీపాలు ఏర్పాటు చేయాల్సి వుందని ఆయన తెలిపారు. కొన్నిచోట్ల 18 మీటర్ల మేర రహదారి నిర్మించడానికి అనుకూలంగాలేదని, ఇందులో మార్పులు చేర్పులు జరిగే అవకాశం వుందని తెలిపారు. ప్రస్తుతం 7 మీటర్ల తారురోడ్డుతో ప్రజలు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు పడుతుండటంతో సుమారు 3 నెలల క్రితమే ఈ రహదారి విస్తరణకు టెండర్లు పూర్తయ్యాయి. త్వరలోనే మరోసారి నిబంధనల మేరకు కొలతలు వేస్తామని ఆయన తెలిపారు.

ఆర్థిక సాయం

కమలాపురం : స్థానిక జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించబడుతున్న ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యార్థినులకు ల్యాబ్ సౌకర్యం నిమిత్తం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి రూ.50వేలు చేసిన ఆర్థిక సాయం పట్ల ఆ పాఠశాల హెచ్‌ఎం ఖాజా పర్వీన్ హర్షం వ్యక్తం చేశారు. బాయ్స్ హైస్కూల్ విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్ అందించడానికి మంగళవారం ఎమ్మెల్యే పాఠశాలకు వచ్చారు. అక్కడున్న ఇంటర్మీడియట్ విద్యార్థినులు తమకు ల్యాబ్ సౌకర్యం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన రూ.50వేలు తన సొంత నిధులు అందిస్తానని, ల్యాబ్ సామగ్రి ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంకు సూచించారు. దీంతో బుధవారం ఆయన రూ.50 వేలు ఆర్థిక సాయం హెచ్‌ఎంకు అందజేశారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

పులివెందుల టౌన్ : ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంఈఓ రామానాయుడు తెలిపారు. బుధవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఇస్లాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం, వన్యప్రాణులు, మానవ ఆరోగ్యంపై ప్లాస్టిక్ సంచుల వల్ల కలిగే హానికరమైన పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ముఖ్యోద్దేశమన్నారు. నిత్యజీవితంలో భాగమైన ప్లాస్టిక్ సంచులు వదులుకోకుంటే భావితరాలకు పర్యావరణానికి, మానవాళి మనుగడకు పెనుముప్పు కలిగే ప్రమాదం ఉందన్నారు. పాఠశాల హెచ్‌ఎం బండి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడితే మన భవిష్యత్తులో ప్రజలు విపత్కర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని వినియోగించే వారు నానాటికి పెరిగిపోతున్నారన్నారు. దీంతో ఇప్పటికే వాతావరణంలో ప్రమాదకర మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. భూతాపం పెరిగిపోవడమే కాక వర్షాలు సకాలంలో పడకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయన్నారు. ఇప్పటికైనా మార్పు రాకుంటే జీవకోటి మనుగడ కష్టమవుతుందన్నారు. ప్లాస్టిక్ సంచుల వాడకం, పర్యావరణం, జీవరాసులకు జరిగే నష్టాన్ని అవగాహన కల్పిస్తూ చేసిన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చర్మవ్యాధుల వైద్య నిపుణులు ప్రతి శుక్రవారం నెలలో మొదటి ఆదివారం అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

డయేరియాను కలిసికట్టుగా అరికడదాం



నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

జమ్మలమడుగు : పట్టణంలో డయేరియా నివారణకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ శానిటేషన్ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. వాతావరణం మార్పుతో నీరు కలుషితం కావడం వల్ల ప్రజలకు డయేరియా వ్యాధి ప్రబలే అవకాశం ఉండటంతో శానిటేషన్ అధికారులు ప్రజలకు నీటిని సరఫరా చేసే ట్యాంకులను శుభ్రం చేయించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్సీ బాలుర వసతి గృహం, ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజి, వసతి గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఈ బాలమల్లేశ్వర్, శానిటేషన్ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ ద్వారా ఉద్యోగావకాశాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసిన ప్రిన్సిపాల్ సురేంద్రనాథ్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జమ్మలమడుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణలో విద్యార్థులు చేరి శిక్షణ పొందడం వల్ల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇటువంటి అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. 30 మంది నిరుద్యోగులు శిక్షణ పొందగా వారిలో 12 మందికి చెన్నైలో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి ఎస్. మహమ్మద్ గౌస్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందుల ప్రజల ప్రేమను మర్చిపోను



మాట్లాడుతున్న పూర్వపు ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల : పులివెందుల ప్రజల ప్రేమ, ఆప్యాయతలను గుండె నిండా నింపుకుని వెళుతున్నానని పాడా పూర్వపు ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. పులివెందుల పట్టణంలోని రాణితోపులో ఉద్యోగులతో కలిసి ఆయన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల అభివృద్ధిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి తోడ్పాటుతో అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకు మునుపు ఆయా శాఖల ఉద్యోగులు అనిల్‌కుమార్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు.

కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



వేంపల్లెలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీపీస్ వింగ్ లీగల్ కౌన్సిలర్ సునీతరాజు

వేంపల్లె : భారతీయ న్యాయ సంహిత కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని వేంపల్లె క్లస్టర్ సీడీపీఓ సునీత తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభాభవనంలో భారతీ న్యాయ సంహిత చట్టాలపై ఐసీడీఎస్ వేంపల్లె ప్రాజెక్టు ఆధ్వర్యంలో చక్రాయపేట, వేముల, వేంపల్లె మండలాల్లోని అంగన్‌వాడీలకు, మహిళా పోలీసులకు, సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టాలను ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందులో భాగంగా సచివాలయంలోని మహిళా సంరక్షణ కార్యదర్శులకు ట్రైనింగ్‌ను ఐసీపీస్ వింగ్ లీగల్ కౌన్సిలర్ సునీతరాజు ద్వారా ఇప్పించారు. అనంతరం సీఐ చాంద్‌బాషా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఉన్న మహిళలకు, విద్యార్థినులకు సమాజంలో జరిగే నేరాల పట్ల అవగాహన కల్పించేందుకు వీలుగా అంగన్‌వాడీలు, మహిళా పోలీసులు కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ క్రిమినల్ ప్రొసిజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని మార్పులు చేస్తూ కొత్త నేరచట్టాలైన భారతీయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం చట్టాలు అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. ఈ కొత్త చట్టాలు జూలై 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లో జరిగే సమస్యలపై ప్రతి వారం పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. తద్వారా గ్రామాల్లో నేరాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఎంపీడీఓ సంపతి దివిజా, తహసీల్దార్ వెంకటేశ్ నాయక్‌లు చట్టాలపై మాట్లాడారు. బాల్య వివాహాలను కూడా అరికట్టాలన్నారు. అంగన్‌వాడీలు కూడా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చట్టాలపై అవగాహన ఉంటే ఫిర్యాదులు ఏ విధంగా ఉంటాయి అనే వాటిపై ప్రజలకు తెలియజేసేందుకు వీలుంటుందన్నారు. ఒంటరి మహిళలు, మానసిక మహిళల గురించి సమాచారం తెలుసుకుని ఉండాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం బాలస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, మహిళా పోలీసులు, చక్రాయపేట, వేముల, వేంపల్లె మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐపీసీ ఇక నుంచి బీఎన్‌ఎస్‌గా మార్పు

కమలాపురం : ఈనెల 1వ తేదీ నుంచి ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ)ను భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్)గా మార్పు చేశారని కడప వన్‌స్టాప్ సెంటర్ అడ్వకేట్ ఉమా తెలిపారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో కమలాపురం, వీఎన్‌పల్లె, వల్లూరు మండలాల ఎంఎస్‌కేలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుంచి ఐపీసీని బీఎన్‌ఎస్‌గా మార్పు చేశారని, ఈ మార్పును మనం ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఉమెన్ హెల్ప్‌లైన్ 181కు కాల్ చేసి మహిళలు, పిల్లల సమస్యలుంటే ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇక నుంచి జీరో ఎఫ్ఐఆర్ కూడా అమల్లో ఉందన్నారు. జీరో ఎఫ్ఐఆర్ అంటే సంఘటన జరిగిన ప్రాంతంతో సంబంధం లేకుండా మనం ఎక్కడైనా ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో సైతం ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈనెల 1వ తేదీ నుంచి బీఎన్‌ఎస్ చట్టం అమల్లోకి వచ్చిందని, మూడు రోజుల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, మూడేళ్లలో విచారణ పూర్తి చేయాలన్నారు. సీడీపీఓ వసంతబాయ్ మాట్లాడుతూ యుక్త వయస్సులో వచ్చే మార్పుల గురించి వివరించారు. కడప పీడీ కార్యాలయ నోడల్ ఆఫీసర్ వాణి మాట్లాడుతూ మహిళలు పని చేసే సంస్థల్లో వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ పరిధిలోని సూపర్‌వైజర్లు, ఎంఎస్‌కేలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : మారిన కొత్త చట్టాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జమ్మలమడుగు సివిల్‌కోర్ట్ బార్ అసోసియేషన్ సెక్రటరీ కె.మురళీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరిదేవి అధ్యక్షతన కొత్త చట్టాలపై గ్రామ వార్డ్ సచివాలయ మహిళా పోలీసులకు అవగాహన కల్పించారు. దేశంలో 3 కొత్త చట్టాలు జూలై 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయన్నారు. వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ జి.మహేష్, న్యాయవాదులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా అధికారి ఉమామహేశ్వర కుమార్

తొండూరు : తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య కేంద్రంలోని టీకాల శీతలీకరణ, కాన్పుల గది, రోగులకు అందించే సేవలపై ఆరా తీశారు. అలాగే ఇనగలూరు ఉపకేంద్రంలో రికార్డులను, టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీసీజీ టీకాలు 100 శాతం చేయాలన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమం 5 సంవత్సరాల పిల్లలకు, తల్లులకు సమావేశాలు నిర్వహించి అతిసార వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రేష్మా, జిల్లా కమ్యూనిటీ అధికారి మునిరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలు బంద్‌కు సహకరించాలి

జమ్మలమడుగు : పట్టణంలోని విద్యాసంస్థలన్నీ గురువారం జరిగే బంద్‌కు సహకరించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో వారు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం నీట్ పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైందన్నారు. నీట్ పేపర్ లీకేజిలపై న్యాయ విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలను తీసుకోవాలన్నారు.

మార్కెట్ వేలంపాటలో రూ.40.30 లక్షలు ఆదాయం



వేలంపాటలో పంచాయతీ ఈఓ వెంకటసుబ్బారెడ్డి, తదితరులు

వేంపల్లె : వేంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సంత మార్కెట్ వేలంపాటలో రూ.40.30 లక్షలు ఆదాయం లభించిందని పంచాయతీ ఈఓ వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో సంత మార్కెట్‌కు సంబంధించి డీఎల్‌పీఓ రమాదేవి సమక్షంలో వేలంపాట నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులు రూ.20 లక్షలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. అయితే కుప్పాలపల్లి గ్రామానికి చెందిన రామగంగిరెడ్డి రూ.40.30 లక్షలు హెచ్చు పాటపాడి దక్కించుకున్నారు. గతంలో సంవత్సరానికి రూ.33 లక్షలు ఉండగా ఈ ఏడాది 9 నెలలకే రూ.40.30 లక్షలు వేలంపాటలో అదనంగా రూ.7.30 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. అలాగే వేంపల్లె పంచాయతీకి సంబంధించి 33 వాణిజ్య సముదాయ గదులు వేలంపాట ఉండగా ఎవరు పాల్గొనకపోవడంతో వాయిదా వేసినట్లు ఈఓ తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

జమ్మలమడుగు : అంగన్‌వాడీ కార్యకర్తల, వర్కర్స్‌ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకురాళ్లు భాగ్యలక్ష్మీ, లక్ష్మీదేవిలు కోరారు. బుధవారం టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌ను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఎటువంటి రాజకీయ వేధింపులు లేకుండా, ప్రభుత్వం తమకు నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు, పనివత్తిడి తగ్గించాలన్నారు.